# జీవితసంధ్య

రచన :
" రాజ్యశ్రీ "

బెంగాలులో ఓ మారుమూల కుగ్రామానికి జనసంచారంలేని ప్రదేశానికి నన్ను ASM గా ట్రాన్సఫరుచేశారని ఆర్డరు చేతిలోనికి వచ్చేప్పటికి నాకు ధైర్యం సడలింది. ఇన్నాళ్ళు యిక్కడ ప్రశాంతంగా దూరంగా ఆ నల్లటికొండలవెనుక మోదుగపుష్పాల సాగసునుచూస్తూ స్టేషనుప్రక్కగా పారే ఆ సెలయేటి స్వచ్ఛాతిస్వచ్ఛమైన నీటి జల జల శబ్దాన్ని ఆనందంగా వింటూ, చూస్తూ నా మనస్సుని ఆనందఅవధుల్లో వుంచుతున్నా. నా జీవితంలో ఒంటరితనం అనే బాధలేదు. ఇరవై రెండు వసంతాలు గడుస్తున్నా, ఏకాకిగా ఇక్కడే వుంటూ అంత రష్షులేని ఆ చిన్నస్టేషనుకు అధికారినై వస్తూపోతూవుండే రైళ్ళను జాగ్రత్తగా సాగనంపటం అలవాటై నాలుగు సంవత్సరాలైంది. నా జీవితడైరీలో పగలు, అర్ధరాత్రి, అపరాత్రి అనేవాటికి భేదమేలేదు. నాదగ్గర పనిచేసే కూలీలతో కబుర్లుచెప్పుకుంటూ ఉండటం అలవాటు. వాళ్లలో ఒక ముసలివాడున్నాడు. వాడు వనమాలి. నాలానే ఒంటరివాడే. చిన్నతనంలో రాధానగర్‌నుంచి తల్లి దండ్రులకు చెప్పకుండా పారిపోయివచ్చి ఇక్కడ రైల్వేలో చేరాడు. అసలు బెంగాలీవాడైనా, హిందీ, ఒత్రం బాగా మాట్లాడేవాడు. నేను ఈ ఊరు వచ్చిన క్రొత్తలో....అంటే క్రొత్తగా ASM ఛార్జీ తీసికొన్నప్పుడు అడిగాడు — 'బాబూ— మీరు తెలుగుబాబులా? బాగా చిన్నవారు నాయనా? ఈ అడవిలో ఒక్కరూ ఎట్లా వుంటారు' అన్నాడు హిందీలో. నాకు తిరిగి సమాధానం బాగా రాదు. ఏదో వాడికి అర్థమయేటట్లు సంజ్ఞలతో చెప్పా-అప్పటినుంచే నన్ను కనిపెట్టుకువుండేవాడు. 'బాబూ మీరు చెయ్యికాల్చుకోలేరు? నేను వండిపెట్టేదా?' అన్నాడు. ఆరోజునుంచి తనే వండేవాడు. నాకు స్టేషనుకి ఓ ప్రక్కగా క్వార్టర్సు యిచ్చారు. భోజనంవేళకి ఇంటికిపోయి, వాడు పెట్టేది తింటూండేవాణ్ణి. క్రమేపి మా పరిచయము హృదయాలకలయికయింది. నేను పెద్దవాణ్ని—వాడు కూలి అనే తారతమ్యం లేకుండాపోయింది. నా డ్యూటీ అయిపోగానే ఒక్కడ్నే ఆ కొండలకేసి పోయేవాణ్ని. స్టేషనుకి నాలుగు ఫర్లాంగులదూరం వుంటుందేమో....అక్కడ రెండు కొండలు ఒకదానికొకటి ఎదురుగావున్నాయి. వాటిమధ్య ఏర్పడిన లోయలో సెలయేరు ప్రక్కగా వరుసలు తీర్చినట్లు, మోదుగలు, పున్నాగచెట్లు ఎర్రటి పుష్పాలు మధ్యమధ్య తెల్లటి పున్నాగపుష్పాలు అవిగాక అడవిపువ్వులు అనేకరకాల పుష్పజాతి అంతా అందంగా వుంది. రకరకాల కుసుమ సౌరభ్యాన్ని ఆఘ్రాణిస్తూ సెలయేటి నీటిలో ప్రతిబింబించుతూంటే ఏవేవో అవ్యక్త మధురభావాలతో గంటలు, రోజులు గడిపేవాణ్ణి.

వసంతకాలంలో పున్నమినాడు ఆ ప్రకృతికాంత సంపూర్ణ యౌవని స్నిగ్ధసుకుమార ముఖబింబంకుమల్లె అనిర్వచనీయమైన ఆనందంతో మెరిసిపోయేది. నా రైల్వేగరమ్‌కోటు డ్రెస్‌వేసుకొని ప్రకృతికాంత ఒడిలో సొమ్మసిలి సోలిపోయేవాణ్ణి. పున్నాగపుష్పాల మధ్య అణిగి, వసంతకాలవెన్నెలను తింటో హృదయం మత్తెక్కి మనోరంజకంగా గానమాధుర్యంచేసేవి ఆ కోయిలజంటలు.

నా జీవితంలో ఏదో లోటుందేమో అనిపించేది వాటి గానసుధారసం వింటూంటే. నా హృదయం విప్పిచెప్పుకొనేది ఎవరికీ సౌరభ్యం వహించేందుకు ఓ ప్రాణివుంటే? అనిపించేది అది ముహూర్తకాలం అంతే!

వనమాలి నాకు లోటులేకుండా చూసేవాడు. తన యౌవనంలో జరిగిన ఓ గాధ చెపుతూండేవాడు. తన జీవితాన్ని అంకితం చేశానన్న ప్రేయసి ఏవిధంగా వంచనచేసింది చెప్పాడు. అప్పటినుంచి ఆడవాళ్ళంటేనే అసహ్యభావంతో చూశానని, గుండెదిటవుచేసికొని, ఆ స్థలంవదలి ఇక్కడకువచ్చి అప్పటినుంచి ఉద్యోగంలో ఉండేవాణ్ణని చెప్పేవాడు. అది వింటూంటే అంతేనా అనిపించేది.

ఇట్లాంటి ప్రదేశాన్ని మనుష్యుల్ని విడిచి నేను పోవాలా? అధికార్లను వేడుకున్నా—నాకీ ట్రాన్సఫరు చేయవద్దని. పోనీకొంతకాలం ఇక్కడే ఉంచమన్నా—కాని, వారి రాతి హృదయాలు కరగలేదు. నేనీ ఊరు బయలుదేరి వెళ్ళవలసినరోజు దగ్గిరపడింది.

ఉన్నసామానంతా వనమాలే చక్కగా కుదిర్చి ప్యాక్‌చేశాడు. నేను వెడుతున్నానని తెలిసినదగ్గరనుంచి వనమాలికి మతేలేదు. కంటినుండి ఏకధారగా నీరు కారుస్తోనే వున్నాడు. ఆరోజు ఆదివారం నేను బయలుదేరుతున్నానని చెప్పా.

'బాబూ మీరు ఈ గతిలేనివాణ్ని ఒదిలి పోతారా? నాకీ ఉద్యోగం వద్దు బాబూ మీ దగ్గిరే పడివుంటా తీసుకువెళ్లరూ?' కంటికి ఏకధారగా యేడ్చాడు.

'వనమాలీ నాకేం అభ్యంతరంలేదు కాని, సుఖంగా సంపాదిస్తో నువ్వైనా ఈ ప్రదేశాని చూస్తోవుండు' అన్నా ఎన్నో విధాల బ్రతిమాలా చివరకు ఒప్పుకున్నాడు. నేవెళ్లే రైలు ప్లాటుఫారం చేరింది నా సామానుఅన్ని తనే

జాగ్రత్తగా రైల్లో పెట్టాడు. రైలుకదిలింది వనమాలి మనగ మసగగా కన్పించాడు.

వరుసగా ఒక పగలు రాత్రి గడిచాయ్ నే చేరవలసిన స్టేషను దగ్గరపడుతోంది. సాయంత్రం పడుతున్నకొద్ది నాహృదయంలో భయం యేర్పడింది. అసలే చలికాలం దానికి తగ్గట్టు ఇక్కడ చలి యెక్కువ. నా గరమ్ కోటువేడి ఏమి చాలటంలేదు. రగ్గుతీసుకొని కప్పుకొని ఒక సిగరెట్‌తీసి కాల్చుకుంటూ ఆలోచనలో పడ్డా. నా ఆలోచనలతో ఎంత టైమయినది, ఎంతదూరం వచ్చింది తెలుసుకోలేదు. 'ఇంద్రబీల్' అంటూ కేకలు వినపడేప్పటికి నాకు మెలుకువవచ్చింది. విడిగావున్న సామాన్లు తీసికొని దిగాను. అంతా నిర్మానుష్యంగా వున్నది. కనుచూపుమేర జనసంచారంలేదు. స్టేషనుదగ్గరగావున్న రైల్వేయిళ్ళు తప్పిస్తే మరేంలేదు. ఆరోజు ఆస్టేషనులో దిగినవాణ్ణి నేనే తిన్నగా S M గదికివెళ్ళి చెప్పాను. రాజారావ్ నేనే అని ట్రాన్స్‌ఫరుమీద వచ్చానని. ఎంతో గౌరవంగా మాట్లాడి సామానంతా పట్రమ్మని కూలితో చెప్పి స్టేషనుప్రక్కగావున్న ఓ యింటికి తీసికెళ్ళాడు.

'రావ్‌బాబూ ఈ యింట్లోనే ఉండండి. ఈ ప్రక్కయింట్లో నేను వుంటున్నా. రేపు కలుసుకుందురుగాని' అన్నాడు. టైము చూసుకున్నా ఎనిమిదిన్నర రెండు రోజులనుంచి భోజనం లేక మంచి ఆకలిగా వుంది. ఈ ప్రదేశం చూస్తే ఆఖరికి 'చా' కూడ దొరకదన్నట్టు తోచింది. 'కేరియర్‌తో పరోటాలు పంపిస్తా.... ఆకలితీర్చుకోండి' అన్నాడు. ఆ మాటకు ప్రాణంలేచివచ్చినట్లయింది. ఒక అరగంటలో కేరియర్ వచ్చింది. కాళ్ళు, చేతులు కడుక్కొని ఫలహారంచేసి విశ్రమించా.

మర్నాడు డ్యూటీలోచేరా. అంతా కొత్తగానే వుంది. రెండు మూడు రోజులు సామానులు సర్దుకుంటంలో గడిచింది. రోజులుగడుస్తున్న కొద్దీ అదే అలవాటైపోతుంది. నాలుగు మైళ్ళ దూరంలోవున్న పక్కవూరికి పంపించి వంట సామాగ్రి అంతా తెప్పించారు. వంట పెట్టా.

ఒకరోజు సాయంత్రం డ్యూటీ అయిపోయిందికదా అని తిరగటానికి బయలుదేరా. స్టేషనుకి పశ్చిమంగా ఒక చిన్నరోడ్డుపోతుంది. ఆరోడ్డు కిరువైపుల మోదుగచెట్లున్నాయి. ఒక అరమైలు నడిచాక చెరువు ఒకటి కన్పడింది. అంతవరకు యెపుడూ యీదారిన రాలేదు. చెరువున్నట్టే తెలియదు. చూద్దామని కోరిక పుట్టి వెళ్ళా. చెరువునిండా తామరపువ్వులు ఎర్రటివి, తెల్లటివి, తామరాకులు తేలుతూ వున్నయి కన్నులపండువుగా కన్పడింది. నీటికాకులురొదచేస్తున్నయ్. పావంచాలుప్రక్కగా పాలరాతితో ఓ విగ్రహం వున్నయ్. దగ్గరకు వెళ్ళి ఆశ్చర్యపోయా. జలజంనుండి పుట్టివస్తున్న లక్ష్మీదేవిలా ఇరవై సంవత్సరాల జవ్వని పాదాలమీద జీరాడుతున్న పసుపు పచ్చని పరికిణీ కుచ్చెళ్ల నెత్తిపట్టుకొని, చ కని బిందెతో వయ్యారంగా హొసనడకతో వస్తుంటే ఆశ్చర్యపోయా. ఈ శూన్యప్రదేశంలో ఈలాటి జవ్వని ఎక్కడుంది ఇంతదూరం నీళ్లకోసం వచ్చిందా? ఆలోచనలు ప్రవాహం మరొక్కసారి చూశా. పసుపుపచ్చని పరికిణీ ఎర్రటి వెల్వెట్‌రవిక తెల్ల క్రేప్‌వోణీ అబ్బ! నిజంగా అప్సరసలా వుంది. కావ్యనాయక జ్ఞప్తికి వచ్చింది. కట్టుకున్న పరికిణీ వర్ణంలోవున్న శరీరం అవయవాలపొందిక నా మనస్సుని భ్రమింపచేసింది ఇంత చక్కనికన్నె అనిపించింది. బాహ్యజ్ఞాన శూన్యుండైనా పైపావంచా ఎక్కుతుండగా కాలుజారిందసుకుంటా బిందెతో పడింది. ఒక్కసారి పోయి పట్టుకొన్నా ఒళ్లంతా నీటితో తడిసింది. అసలే పల్చటిబట్టలు తడిసి శరీరానికి ఓగుతుగా పట్టుకొన్నయ్. అవయవాలసొంపు స్పష్టంగా కన్పడింది. మోచేతికి దెబ్బతగిలి చిట్లి రక్తం ప్రవహించింది. జేబురుమాలు తడిపికట్టి బిందెతో నీటిని నింపి ఆమెకిచ్చాను. చాల సిగ్గుపడి మాటతొట్రుపడింది నెమ్మదిగా కోయిలలా పల్కింది బెంగాలిలో 'నమస్కార్ అమీ అప్నాకి ఒనేక్ కష్టోది మేచి మాప్ కొరూన్' సిగ్గుతో తలవంచుకొనింది. సంభాషణ బెంగాలీలోనే జరిగింది.

'నాకు కష్టమేమిటండి! ఈరోజు మీరు ఎవరి ముఖం చూసేరో కాని దెబ్బతగిలింది' అన్నా.

గులాబీపూరేకుల్లాంటి పెదాలు ఆనందంతో వికసించి తుమ్మెదరెక్కల్లాంటి ముంగురులు ముఖపద్మంమీద కేరింతలు కొట్టున్నయ్. యువ్వనంతో పరిపూర్ణంగా నిండిన ఆమె ముఖంచూస్తే నగ్నంగా ఉన్నప్పుడు తీక్షణంగా చూస్తే కళ్లే పులకరింపు కలిగింది.

నెమ్మదిగా అడిగా 'మీపేరు?'

'షీలాదేవి'

'ఎక్కడ ఉంటున్నారు?'

'పడోషి బెనర్జీగారు S M వారి అమ్మాయిని' అన్నది ఆ క్రీగంటిచూపులు నా హృదయానికి చక్కలిగింతలు కలిగించాయి.

'నేను ఆ ప్రక్కనే ఉంటున్నా కొత్తగా A S M గా వచ్చా'

'బాబా చెప్పారు వస్తానండీ' అన్నదామె.

'జాగ్రత్తగా చూసి నడవండి దారిలో బొప్పిలుతగిల్తే బోర్లపడతారు అంటూ ఆమె వెనుకే బయలుదేరా. ఆమెముఖం కెంపువర్ణం దాల్చింది. కళ్లలో కోపంతోకూడిన నవ్వు కన్పడింది.

'ఈ దారంతా తెలిసినదే మీకు క్రొత్తేమో జాగ్రత్త' అందామె.

నేను విసిరినబాణం సూటిగా నాకే తగిలినందుకు సిగ్గనిపించింది.

'రోజూ వస్తుంటారా?' పిచ్చిగా అడిగా.

కనుబొమల్ని వింటిలా విరిచి సెలయేటి నీటిలా నవ్వుతూ వెళ్ళిపోయింది.

ఆ ప్రథమ పరిచయంలో ఆనందం అదో హాయికలిగాయి. తిరిగి తిరిగి యింటికి చేరుకున్నా. మర్నాడు సాయంత్రం నిద్రలేచేప్పటికి 4–30 అయింది. మాఘమాసపు నీరెండ కొబ్బరిచెట్లమీదపడి వింతకాంతులతో మెరుస్తున్నది. బాత్‌రూములోకివెళ్ళి మొఖం కడుక్కొనివస్తున్నా అంతలోనే వీధితలుపు చప్పుడైంది.

'రావ్‌బాబూ! నాన్న గారు పిలుస్తున్నారు' అంటూ పడోషీబాబు కొడుకు వచ్చిచెప్పాడు.

'వస్తున్నా అంటూ తొందరగా డ్రెస్‌వేసుకొని బయలుదేరా.

'నమస్కార్ రావుబాబూ' అంటూ చెప్పాడు పడోషి. ప్రతి నమస్కారం చెప్పి కూర్చున్నా. మామూలు సమాచారాలు అయ్యాక డ్యూటీ గురించి మాట్లాడుకున్నాం. లేవ్దామనేప్పటికి పడోషీబాబు అన్నారు.

'అమీ షీలాకే 'చా' నియాస్తే బోలేచి' అంటూ కూర్చోపెట్టారు. అసలిక్కడ మర్యాదలంతా అదోరకం. బీదవాడిదగ్గర్నుంచి జమీందారువాకా ఎవరైనా ఇంటికివస్తే 'చా' తాగనీయకుండా కదలనీయరు.

'షీలా టీపాయ్ తీసికొనివచ్చింది. పడోషీబాబు 'చా' యిచ్చాడు. కొద్దికొద్దిగా 'సిప్,

చేస్తూ షీలానిచూస్తున్నా. మా నాలుగుకళ్ళు కలుసుకునేసరికి సిగ్గుతో తలవంచుకొనేది. తలంటి నీళ్ళుపోసుకుం దనుకుంటా జుట్టు చిలిపిగావుండి ముఖంమీద పడుతోంది, తెల్లటి క్రేప్‌చీర ఎర్రటి వెల్వెట్ జాకెట్టు ఎప్పుడు డ్రస్‌వేసుకొన్న కలర్సు మ్యాచ్ అయేటట్లే ముఖ్యంగా నామనస్సు గ్రహించుకొన్నట్లేవేసు కుంటుంది.

'షీలా కూర్చోమ్మా ఈయనే రావ్‌బాబు అని పరిచయంచేశారు. 'నమస్కార్' అంటూ విచిత్రంగా చూసింది. మాటలకాలక్షేపంతో కాలం అతి త్వరగా వెళ్ళిపోయింది. 'వస్తానండి' అంటూ బయలుదేరాను.

'అప్పుడప్పుడు యింటికి వస్తుండండి' అన్నాడు.

* * *

కాలం అతివేగంగా వెళ్ళిపోతోంది. నేను ఈ ఊరు వచ్చి అప్పటి నాలుగు నెలలు గడిచాయి. వెనుక జరిగిన సన్నివేశం మనస్సులో పీఠంవేసుకొన్నట్లుంది. అది కాలంతో పాటే మార్పుచెందుతూ ఏదో అవ్యక్తానందంతో వుండి అనుభూతిని కల్పిస్తూవుంది.

పగలల్లా ఎండ అపరిమితంగా ఉండటం ఉక్కపోయటంవల్ల తలంతా దిమ్ముగా వుండి వినుగు ఎక్కువైంది. దూరంగా తూర్పు కొండల్లోనుంచి చందమామ పైకి వచ్చాడు. గాలి మార్పుచెంది చంద్రుడిలోని చల్లదనాన్ని తీసుకొని మందమారుతంతో హాయి కల్పిస్తూవుంది. గ్లాస్కో పంచ బంగాలీ లాల్చీవేసుకొని వెన్నెల్లో తిరగటానికి బయలుదేరా. నాకాళ్ళు నాకు తెలియకుండానే చెరువుగట్టు వైపుకు తీసుకొనిపోయాయి. వెన్నెల వెలుగుల్లో ఆ ప్రదేశమంతా ఆనందంతో హాయిగా ఉన్నట్లనిపించింది. ఏవేవో ఆలోచనలతో కూర్చుండిపోయా. చెరువులో ఏదో శబ్దం వినిపించి ఆటువైపు తిరిగాను. షీలాదేవి బిందెతో నీళ్ళు ముంచుతూ కన్పించింది. మనస్సు ఆనందంతో ఉరకలు వేసింది పల్కరిద్దామనుకుంటే మాట పెకిలిరాలేదు. చేయి కదిపాను. షీల తలవంచుకుంటూ దగ్గరనుండే వెళ్ళిపోతోంది. నేనే పల్కరించా. పావంచాలకు ప్రక్కగావున్న పాలరాతితిన్నెమీదకూర్చున్నాం. షీల ఆ వెన్నెల్లో అపరంజి బొమ్మలా వుంది. ఆ మాటే అన్నాను.

'అయితే రావ్‌బాబూ మీకు కవిత్వం పుట్టుకొస్తుందే' అంది.

'దేవలోకంలోవుండే దేవకన్యలంటారు. వాళ్లను చూడలేదు కాని నీ అందంచూస్తుంటే వారికంటేకూడ అనేక రెట్లు నువ్వే మెరుగనిపిస్తుంది. షీలా ఈరాత్రివేళ ఒక్కర్తెవూవస్తే భయంకదూ!' అడిగాను.

'మీరుంటే భయం ఎందుకు ? నన్నేమైనా ఎత్తుకుపోవునా?' నవ్వుతూ సమాధానం చెప్పింది.

'నేను ఇక్కడుంటానని కల కన్నావా?'

'మీరు ఇక్కడుండక ఇంకెక్కడుంటారు? నాకు తెలుసునుకదూ!' చమత్కారంగా విసిరింది.

'షీలా నిన్నుచూస్తూ కూర్చుంటే మిగిలిన విషయాలన్నీ మరచిపోతుంటా. నీ కళ్ళల్లో వుండే ఆ తళుకుతో నేను మత్తెక్కిపోతాను షీలా....షీ....

'అబ్బ! మరీ పిచ్చివారైపోతారేం!'

'నీవుకాక నా జీవితానికి ఏం వుంది షీలా' అంటూ ఆ నున్నటి గుండ్రని భుజాల్ని పట్టుకొన్నా. షీల తన కళ్లకాంతుల్తో నా శరీరాన్ని తడుముతుంటే ఏదో తీయనిబాధతో కూడిన అవ్యక్తానందం కలిగింది.

'రాజా ఇటు చూడరూ?' అంటూ తన చేతుల్తో నా తల పట్టుకొని, ఆ లేతవేళ్లని నా నొక్కులజుట్టులోనికి పోనిస్తూ తన కాటుక కళ్లతో నా కళ్లను వెదుక్కుంటూ నా వొడిలో వాలిపోయింది. 'రాజా' అన్నప్పుడాకంఠంలో మార్దవం అబ్బ! చెప్పలేను. జీవితంలో ఆనందము, తృప్తి, కోరిక అనేవి ఏమిటో ఈరోజే గ్రహించగలిగాను. ఆ మధుర క్షణాలలో హృదయం పరవళ్ళుత్రొక్కి, ఆ మృదుశరీర స్పర్శకు నా రక్తం, నరాలు పులకరించిపోయి ఎంతో వేడిగా ప్రవహించాయ్.

అలసటతో అడిగా 'షీలా నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?'

'ఆ ప్రశ్నే మిమ్మల్నివేస్తే ఏం సమాధానం చెప్తారు' అంది చిన్నగా నవ్వుతూ.

'ఎలా చెప్పాలో తెలియటంలేదు షీలా— మాటలురాక మూగవాణ్ణయ్యా'

'అదేస్థితి ప్రభూ' అందామె.

ఇంటికి బయలుదేరాం.

* * *

ఆరోజున జరిగిన సన్నివేశంతో పూర్తిగా మారిపోయా, తెల్లవారిలేస్తే ఏవో లోటు కన్పడుతుంది. ప్రక్కగా షీలావుంటే ఎంతానందం! జీవనయాత్ర సాగిస్తూనేవున్నా—పడోషిబాబు కన్పిస్తే ఇంటికి తీసికొనివెళ్లారు. మేం మాటల్లో దిగుతే షీలాకూడ మాతో వాదనచేస్తుంటుంది. ఒకరోజున రాత్రి భోజనాలయాక ఆరుబయట కుర్చీలో పడోషిబాబు చంటివాడ్ని పెట్టుకొని పాంచాలీగీతం పాడుతున్నారు. ఒకప్రక్క కొడుకు మరొక కుర్చీలో షీలా కూర్చున్నారు. నేను అలా వెడుతుంటే పిలిచారు — వెళ్ళి కూర్చున్నా. ఆయన పాడే గీతం పూర్తయాక మాట్లాడాను.

'ఏమిటి మీరూ పాంచాలీ గీతాలు పాడుతున్నారేం!'

'బాబా కూడ అప్పుడప్పుడు పాడుతూనే వుంటారు' అంది షీలా.

కొద్దిసేపు మౌనంగా కూర్చున్నాక పడోషి బాబు అడిగాడు.

'రావ్‌బాబూ మీరొక్కరే ఎంతకాలం వండుకుంటూవుంటారు. పెండరాశో కోడల్ని తీసుకురండి' అన్నారు.

ప్రాణంలేని ఓ నవ్వు నవ్వుతూ అన్నాను 'ఈ జీవితానికి సాయం మరో ప్రాణిని బాధపెట్టటం ఎందుకండి! యిట్లానే గడుస్తుంది.'

'ఏమిటది రావ్‌బాబూ ! అంత నిరాశతో మాట్లాడతారేం' అన్నాడు.

తన హృదయంలో భద్రంగా దాచుకున్న ఓ మూర్తిని ఎవరో వెంగిలించుకుపోతున్నట్టు త్రొటుపడి జాలిగా చూసింది షీల.

'పడోషిబాబూ! నిరాశకాక ఏమిటి చెప్పండి జీవితంలో మనస్ఫూర్తిగా ప్రేమించినవ్యక్తుల్ని చేసుకొని సుఖపడదామంటే — సంఘం అనే సంకెళ్ళు కాళ్లకు బంధాలువేస్తయ్. మానవజాతి ఒకటే. రెండే రెండు విభాగాలు. ఒకటి మొగ రెండు ఆడ .... అనే వాదన వింటే ప్రపంచం మనల్ని పిచ్చివాణ్ణిగా చూస్తోంది. ఎంతవరకు ఈ సంఘం స్వార్థానికి తయారు చేసిన చట్టాలు ఆమోదింపబడుతయో—అంతవరకు ప్రేమ-ప్రణయం-వాటికి రూపే ఏర్పడదు....'

'మీరు చాల ఉద్రేకంతోమాట్లాడుతున్నారు. రావ్‌బాబూ — మనం సంఘంలో ఒకళ్లగా ఉంటున్నప్పుడు దాన్ని ఎదిరించి నిలబడేశక్తి లేనప్పుడు తలొగ్గి ఆచరించవలసిందే కాని మాటలతో ప్రయోజనంవుండదు. మీ యవ్వన రక్తంలో ఏవేవో సుఖాల్నిగురించి ఆలోచిస్తూ

ఆత్రంగా వుంటారు. నా జీవితంలో నేను సంపాదించిన లోకానుభవంనిబట్టి ఆలోచిస్తే మీరు తొందరపడుతున్నా రనుకుంటాను.

'అయితే బాబూ—సంఘం అంటారుకదా! వాటిలోవున్న కుళ్లును తీసేసి మనం మార్గదర్శకులం కాకూడదా' అంది షీల.

'పిచ్చితల్లి! నీకు తెలియదమ్మా! ఒక్కొక్కసారి భావోద్రేకాలకు లోనయ్యి సంఘంని ఏదో మరమ్మత్తుచేద్దామనే యువకరక్తం ప్రయత్నించి చివరకు నామరూపాలు లేకుండా పోతుందమ్మా — మీ వయస్సు అంత అనుభవం ఉందమ్మా. ఇంకా ఎన్నో దశాబ్దాలో గడుస్తే కాని మారటం అసంభవము' చంద్రకిరణాలు సూటిగా షీలాకళ్లలో ప్రతిఫలిస్తున్నాయ్—ఆ కళ్ళు ఏవో బాధతో అజ్ఞాతలోకాల్లోకి పోతున్నట్టు ఆలోచిస్తున్నయ్.

'అమ్మ పిలుస్తోందండి' అంటూ వచ్చాడు పదోషిబాబు కొడుకు. నేను శలవు తీసికొని బయలుదేరా .... ఎంతసేపూ అతను చెప్పిన విషయాలే గుర్తుకువస్తున్నయ్.

మా ప్రణయం రోజు రోజుకూ అభివృద్ధి పొందుతూవుంది. సమయం చిక్కితే షీలా, నేను సమావేశం అవుతూనే వున్నాం. షీల నాతో సోషల్‌గా మాట్లాడటానికి పదోషిబాబు ఏమీ అభ్యంతరం పెట్టలేదు. ఆరోజు ఆయన చెప్పిన విషయాలుచూస్తే ఈ మాప్రణయానికి రూపు యేర్పడదనిపించింది. సంఘం అంటే భయపడే వ్యక్తి. షీల – బంగాలీ నేనుకాదు. ఈ ముఖ్యమైన భేదంతోటే మా వివాహానికి అంగీకరింపకపోవచ్చు.

★ ★ ★

ఓ సుదీర్ఘసంవత్సరం గడిచింది. నా జీవితంలో ఏ మార్పు లేదు. ప్రదేశం అంతకంటే మార్పుచెందలేదు. నిర్జనమైన స్టేషను ప్రక్కగా వున్న నాలుగు రైల్వేయిళ్ళు మోదుగచెట్లు అన్నీ అట్లే వున్నయ్. ఒకరోజు ఉదయం ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని చూసేప్పటికి నాకు మనస్సు చలించింది. ఏ వనమాలి నా ప్రథమ జీవితాధ్యాయంలో తండ్రితోడై చూస్తూవచ్చాడో అతను నాగురించి ఎక్కడో కనపడకుండాపోయాడు. నా సహోద్యోగి వ్రాసిన ఉత్తరంలో ఇంకా యిట్లావుంది.

'మీరు ఇక్కడనుంచి వెళ్ళిపోయాక వనమాలికిమతేలేదు. ఏదో పరధ్యాన్నంగా వుంటూ పనిచేసేవారు. ఎవరైనా ఏదేనా అంటే నాబాబు వెళ్ళాక నా కంతా చీకటిగా వుంటోంది. పని అంటేనే యిష్టంలేకుండావుంది. మీకు యిష్టమైతేవుంచండి లేకపోతే బాబుదగ్గరకెళ్లిపోతాను. ఈ ముసలివాడ్ని దగ్గరకు తీసుకోకుండా వుంటారా నా తండ్రి అంటూ యేడ్చేవాడు. అతని నెమ్మది, ఇంత సర్వీసుచూసి మేం ఊరుకుంటూవచ్చాం. కొన్నాళ్లకి 'న్యూమోనియా' జ్వరంతగిలింది. ఎపుడూ మీగురించే పలవరింతలు ఆట్లా ఒక నెల మంచంమీద వుండి 'ఒకసారి నా తండ్రిని చూపించరూ' అంటూ అడిగి హఠాత్తుగా ఒకరోజున ప్రాణాలు వదిలేశాడు'....అంటూ....

నే న లా గే చదువుతూ చంటిపిల్లాడిలా ఏడుస్తూకూర్చున్నా. ప్రపంచంలో నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి నా క్షేమంకోరే వనమాలి పోయాక ఇంక నన్ను చూసేదెవరు? అలా గంటలు గడిచాయ్. ఆరోజు డ్యూటీకి వెళ్లలేకపోయా....

సాయంత్రం పదోషీబాబువిషయం ఏమని అడిగాడు. ఆయన విచారించి ధైర్యంచెప్పాడు.

మొదటివ్యక్తి అవిధంగా అయాడు. విశాల ప్రపంచంలో మరోవ్యక్తి నన్ను ప్రేమించింది ఒక్క షీలే! ఒక వారం పదిరోజులు ఆట్లా విచారంతోనే గడిచినది. కష్టాలు వచ్చినా సుఖాలు వచ్చినా వాటినిగురించి కొన్నిరోజులే ఆలోచించటం మానవునికి సహజం. తర్వాత అవి జీవిత అధ్యాయాలలో మూలపడిపోతై.

సాయంత్రం షీ లా దే వి తో ఏకాంతంగా ఉండటం తటస్థించింది. మనస్సులో రగులుతున్న అగ్ని భరించలేక ఆమెతో చెప్పా.

'నాన్నగారి అభిప్రాయం అర్థమయింది కదా రావుబాబూ! మన వివాహానికి అంగీకరించరనే తలుస్తా' అందామె.

'షీలా....హృదయాలు యేకమై, ప్రేమతో పరిణయంచేసుకొని జీవితాన్ని రాచబాటపై నడిపిద్దామని కలలుకన్నా మోడువారిన జీవిత వృక్షానికి దోహదంచేసి చిగిరింపచేశావ్ — ఆ వృక్షం చిగిర్చి ప్రకృతికి శోభకలిగేటట్టు మొగ్గ తొడిగింది. ఆ మొగ్గ పరిపక్వానికి వచ్చి పుష్పించటానికి సిద్ధమయేసమయంలో త్రెంపివేస్తే .... అబ్బ! తలచుకొంటేనే హృదయం పగిలిపోతోంది.'

'రాజా....మీ ప్రశాంత జీవితంలోకి చొచ్చుకొని తీరని వ్యథ కల్పించి, మీ జీవితాన్ని నాశనంచేశా. ఈ దుర్మార్గాన్ని సహిస్తారా?.... నన్ను మర్చిపోయి మీరైనా సుఖంగా ఉండలేరూ?'

'షీలా....అంతమాట అనకు. నన్ను ఈ లోకంలో యిద్దరే ప్రేమించారు. ఒకడు వనమాలి—రెండు నీవు. నీవు లేకపోతే ఇంక జీవితం సమాప్తే షీలా....

'మీ నాన్నగారితో చెప్పలేవూ!' అడిగా.

నిశ్శబ్దం ఆవరించింది. హృదయాలు విచారంతో సలిగిపోయాయి.

★ ★ ★

పదోషిబాబు చెప్పారు: 'రావ్‌బాబూ షీలా చెప్పింది మీరిద్దరు మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నారని; పెళ్లిచేసుకొందుకు అనుజ్ఞకావాలని ఏకభాషకాని, ఏకసాంప్రదాయం కాని విదేశవాసులతో వి వా హ ం చేయటం వీలులేనిది. వివిధవర్ణాలు, వివిధ దేశాచారాలు వుండగా మీ పెళ్ళి జరగటం అసంభవం. ఆమాట తలపెట్టకండి.

ఏ ఆశమీద జీవితాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నానో అదికూడా అడియాస అయింది. షీలా ఎంతగా కుమిలి కుమిలి ఏడుస్తోందో! మానవులు ఉన్నతభావాలు పెంపొందించుకుంటున్నా ఏ మూలో కుదురుకట్టిన మూఢభావాలు వుంటున్నయ్.

'పదోషిబాబూ .... మా బాధ మీకేవిధంగా చెప్పను' షీల ఎంత బాధపడుతోందో తెలియదూ? మీ అమ్మాయిమీద వాత్సల్యంతో కూడ చేయలేరూ?

'రావ్‌బాబూ షీలా చాలకాలంనుంచి తన అభిప్రాయం వ్యక్తపరుస్తూవుంది. ఎంతో ఆలోచించా. మరొక రకంగా చెయ్యటానికి వీల్లేదు. మీ ప్రేమకోసం మా పూర్వాచార సంప్రదాయాలన్నీ మట్టికలపటం యిష్టంలేదు.'

ఈయనా మనిషేనా? ఇంకా ఇరవయ్యో శతాబ్దంలో ఈమాటలా? రాతిగుండె కరగదు. తలవంచుకొని ఇంటికిపోయాను. మర్నాడు సాయంత్రం ఇంట్లోవుండగా ఎవరో పిలిచినట్లనిపించింది. తలుపుతీశా ప దో షీ బా బు కొడుకు. 'బాబా మిమ్మల్ని త్వరగా రమ్మన్నారు' అన్నాడు. బయలుదేరా. వెళ్ళిచూసేప్పటికి మంచంమీద షీలాదేవి ఆయాసంతో బాధపడుతోంది. పదోషీబాబు చంటివాడిలా ఏడుస్తూ కూర్చున్నాడు.

మంచందగ్గరకుచేరి వ్యధతో ఆమెనివెతుకుతున్నా....'రాజా....శలవు' అంటూ షీల వాలిపోయింది. ఏడుస్తూ పిచ్చివానిలా అరుస్తూ.... 'ఇంక సంతోషించండి' అని నల్లని దుప్పటి ఆమె ముఖంమీద కప్పాను. ★